క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు గృహోపకరణాల వితరణ



పాఠశాలకు గ్యాస్ స్టౌ, ఇన్వర్టర్ అందిస్తున్న బ్యాంకు అధికారులు

బోట్‌క్లబ్‌: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం బొల్లంగి బీఆర్ అంబేడ్కర్ గురుకుల రెసిడెన్షియల్ గరల్స్ స్కూల్స్‌కు గ్యాస్ స్టౌ, ఇన్వర్టర్ అందించారు. బ్యాంకు ప్రాంతీయ అధికారి సాయి మనోహర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో సైతం పాఠశాలకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారులు డీవీ రంగారావు, నారాయణ, కె.రాధిక, టి.అర్చన, ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వాకలపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

కాకినాడ రూరల్‌: మండలంలోని వాకలపూడి గ్రామంలో సచివాలయం – 4 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామంలో సచివాలయ పరిధిలో లబ్ధిదారులు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అందుకున్న లబ్ధి వివరాలు ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు వివరించారు. రూ.19.69 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందారని సచివాలయ పరిధిలో రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల నిరసన



అచ్చంపేట జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

కాకినాడ రూరల్‌: కాకినాడ ఏడీబీ రోడ్డులో అచ్చంపేట జంక్షన్ వద్ద జయహో రథసారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లను జైలుకు పంపేలా రూపొందిస్తున్న జీఓతో డ్రైవర్ల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఆ జీఓను విరమించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యేలేటి వాసు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.ఏడు లక్షల జరిమానా విధించేందుకు చట్టం తీసుకువస్తున్నారని, దానిని విరమించుకోవాలని కోరుతున్నామన్నారు. డ్రైవర్లు వి.భూపతిరాజు, రంగా, కిశోర్, మోషే, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ సిటీ: రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగించిన డ్వాక్రా యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద యానిమేటర్లు (వీవోఏ) శుక్రవారం ధర్నా చేశారు. వీవోఏల సంఘ నాయకులు కె.గంగాభవాని, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

23 మంది బైండోవర్

కాకినాడ క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న, అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేసినట్టు వన్ టౌన్ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఎమ్మార్వో కోర్టు ఆదేశాల మేరకు 23 మందిని బైండోవర్ చేసి ఏడాది పాటు కొనసాగించనున్నట్టు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

త్వరలోనే ముస్లిం కల్యాణ మండపం

పెద్దాపురం: త్వరలోనే పట్టణ ముస్లింల సౌకర్యార్థం కల్యాణ మండప నిర్మాణానికి చర్యలు చేపడతానని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక కబడ్డీ వీధి జామియా మసీదులో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనల్లో దొరబాబు ప్రసంగించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడతూ టీటీడీ కళ్యాణ మండపం పక్కన ఉన్న పాత మీ సేవా కేంద్ర భవనాన్ని పునర్నిర్మించి, ముస్లింల కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు సమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముస్లింలు దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, బషీర్, ఖాదర్ పాల్గొన్నారు.

సా..గుతున్న స్నాతకోత్సవ భవన నిర్మాణం

- రూ.19.3 కోట్లతో పనులు
- ఈ ఏడాది ప్రారంభోత్సవానికి సన్నాహాలు



నిర్మాణంలో ఉన్న స్నాతకోత్సవ భవనం

బాలాజీచెరువు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే నిర్మితమై దశాబ్దం గడుస్తోంది. ఈ నెలాఖరున పదో స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నా నేటికీ ఇటువంటి బృహత్తర కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక భవనం అందుబాటులో లేదు. మూడేళ్ల కాల పరిమితితో నలుగురు వీసీలు పని చేసినా వర్సిటీకు ప్రధానంగా ఉండవలసిన స్నాతకోత్సవ భవనానికి శంకుస్థాపనలు చేసారే తప్ప దాని నిర్మాణానికి శ్రద్ధ వహించలేదు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ నిర్మాణంలో జాప్యం వహించారు.

ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలలకు వేదికగా ఉన్న వర్సిటీ ఇప్పటి వరకూ 9 స్నాతకోత్సవాలు నిర్వహించగా కులపతి హోదాలో రెండు సార్లు రాష్ట్ర గవర్నర్లు హాజరయ్యారు. వేడుకలు నిర్వహించేటప్పుడు తాత్కాలికంగా వేదిక ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి తాత్కాలిక వేదికలకు సుమారు రూ.15 లక్షల పైబడి వ్యయమవుతోంది. షామియానాలు, ఏసీలు, వేదిక ఏర్పాటు తదితర వసతులకు ఈ మొత్తం వ్యయమవుతోంది. ఇటువంటి వృథా ఖర్చులు నిలిపివేయడంతో పాటు వర్సిటీకు గౌరవ సూచకంగా నిలిచే స్నాతకోత్సవ భవనం దాదాపు 1500 మంది కుర్చునేనా పరీక్షల విభాగ బిల్డింగ్ పక్కన నిర్మిస్తున్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తొలి సమావేశంలోనే దీనిపై దృష్టి సారించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడంతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

భవనంపై ప్రత్యేక దృష్టి



వర్సిటీకు ప్రధానంగా ఉండవలసిన స్నాతకోత్సవ భవన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ఏడాది ప్రారంభానికి సన్నహాలు చేస్తున్నాం. దాదాపు శ్లాబ్ స్థాయి వరకూ పూర్తి చేశారు. అత్యాధునిక హంగులతో నిర్మాణం చేపడుతున్నాం. రూ.19.3 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించాం. నా హయంలో శంకుస్థాపన చేసిన నేపథ్యంలో పూర్తిచేసి ప్రారంభించాలనే ఆశయంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉండటంతో వర్సిటీలో ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ



ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ విరీష

కాకినాడ రూరల్‌: మండలంలోని తిమ్మాపురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బందిలి విరీషతో కలసి సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ వాటిని పంపిణీ చేశారు. అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే రూ.25 లక్షల వరకు వైద్య ఖర్చులు భరిస్తుందన్నారు. ఎంపీటీసీ బుద్దన వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంత పెన్షన్ దేశంలోనే ప్రథమం

- లబ్ధిదారులకు ఆర్థిక భరోసా
- ఓట్ల కోసమే చంద్రబాబు రాజకీయం
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లు, వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్‌: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, పక్షవాతం ఉన్న వారికి రూ.3 వేల పింఛన్ అందిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఈ నెల నుంచి పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ దగ్గరకు వెళ్లి చేతులు కట్టుకునే పరిస్థితి నుంచి వలంటీర్లు మీ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం జగన్ దిగ్విజయంగా అమలు చేయిస్తున్నారన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తుండడంతో కొన్ని ప్రతిపక్ష పార్టీలు తమ సంక్షేమ కార్యక్రమాలపై బురద చల్లుతున్నారని, ఓట్ల కోసం చివరి రెండు నెలలు రాజకీయం చేసే నాయకుడు చంద్రబాబు అని అన్నారు. నియోజకవర్గంలో సుమారు 35 వేల పైబడి పెన్షన్లను అందిస్తున్నామన్నారు. రూరల్ మండలంలో కొత్తగా మంజూరైన 322 పెన్షన్లతో కలిపి మొత్తం 18,587 మందికి పెన్షన్ల సొమ్ములు రూ.5.43 కోట్లు పంపిణీ చేపట్టారు. సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్లీ సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు నాయుడు చెప్పే మాయ మాటలు నమ్మవద్దన్నారు. మంచి ఏదో చెడు ఏదో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీడీఓ కర్రె స్వప్న, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, పెంకే ఆనందరావు, గొల్లపల్లి రాంబాబు, పండూరు ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీ వాసంశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు గంజా సత్తిబాబు, కరీం బాషా, నల్ల రాణి, రేఖా రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా పింఛన్ పథకం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న



పేదలకు పింఛన్ అందజేస్తున్న సుంకర శివప్రసన్న

కాకినాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక పథకం నిరుపేదలకు ఆసరాగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న పేర్కొన్నారు. స్థానిక 40వ డివిజన్ సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. నిరాదరణకు గురైన వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు పింఛను ఆసరగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్‌: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మండల పరిషత్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను కోరారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్(క్లాప్) లక్ష్యంగా పల్లెలు పరిశుభ్రతతో ఉండేలా ఇళ్లలోని తడి, పొడి చెత్త వేసేందుకు శుక్రవారం డస్ట్‌బిన్లను ఆయన పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ రెండు డస్ట్‌బిన్లను అందిస్తారని, వీటిని ఇళ్లలోని చెత్తను వేసేందుకు వినియోగించాలని అన్నారు. మండలంలో సుమారు లక్షా 3 వేల డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రాంబాబు, ఆనందరావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అయోధ్య రాముని అక్షతలు



కలెక్టర్ కృతికా శుక్లాకు అక్షతలను అందజేస్తున్న పెద్దిరెడ్డి రవికిరణ్



గాంధీనగర్‌లో అయోధ్య రాముని అక్షతలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరిగే రోజున దేశంలో ప్రతి కుటుంబం దీపావళి జరుపుకోవాలన్న ప్రధాని మోదీ విజ్ఞప్తిని ప్రజలందరూ తప్పక పాటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షతలను ఆయన కలెక్టర్ కృతికా శుక్లాకు కలెక్టరేట్‌లో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ కోసం దేశ ప్రజలందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఐదు శతాబ్దాల నిరీక్షణ తర్వాత రాములవారు అయోధ్యకు పునరాగమనాన్ని అందరూ స్వాగతించటానికి ఒక పండుగగా జరుపుకోవడానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధాని చెప్పిన విధంగా రామ జ్యోతి వెలిగించి ప్రతి ఇంటా దీపావళి పండుగ చేసుకోవాలని రవికిరణ్ విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ రాముని అక్షతలు

అయోధ్య బలరాముని అక్షింతలు ప్రతి ఇంటికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుటున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ సహకారంతో శుక్రవారం స్థానిక గాంధీనగర్ ఓలేటి వారి వీధిలో అక్షతలను పంపిణీ చేశారు. అక్షతలతో పాటు, ఆలయ చిత్రపటం కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో సుమారు 60 శాతం వరకు ఇంటింటికీ వాటిని పంపిణీ చేసినట్టు తెలిపారు. దేశమంతా 15వ తారీకు వరకు ఇంటింటికీ రాముని పవిత్ర అక్షతల పంపిణీ జరుగుతోందన్నారు. విశ్వహిందూ పరిషత్ ప్రచార సమితి కన్వీనర్ గరిమెళ్ల అన్నపూర్ణ శర్మ, కార్యవర్గ సభ్యులు ఉదయ బానోజీ రావు, బీవీడీ రవివర్మ, బలివాడ మల్లేశ్వరరావు, గూటూరి పద్మ, గరిమెళ్ల లలిత సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో సంక్రాంతి శోభ

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పలు డివిజన్లలో సంక్రాంతి సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



మ్యూజికల్ చైర్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి, శివప్రసన్న తదితరులు

కాకినాడ: జగనన్న సంక్రాంతి సంబరాలతో మహిళల్లో పండుగ శోభ కనిపిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 29వ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి, మహాలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అక్కడ మహిళలు వేసిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో మహిళల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలోను ఈ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు రూ.లక్షల విలువైన బహుమతులను అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా పదో తేదీన జరిగే ఫైనల్స్‌లో ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ వంటి ఖరీదైన బహుమతులు కూడా అందిస్తున్నామన్నారు. మహిళలంతా ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాగా జగన్నాథపురంలో జరిగిన పోటీల్లో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక 4వ డివిజన్‌లో జరిగిన పోటీలలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, పలకా సూర్యకుమారి తదితరులు పర్యవేక్షించారు. 38వ డివిజన్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పార్టీ నాయకులు బాలాప్రసాద్, కర్రి వీర్రెడ్డి (చినబాబు), కృష్ణప్రియ, గోడి వెంకట్, చొదరి తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో భాగంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ ఎదుట ప్రభుత్వ పథకాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



జగన్నాథపురంలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళా దీప్తి

చెత్తను రోడ్లపై వేయొద్దు

- వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించండి
- కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం
- కార్మికుల సమ్మె నేపథ్యంలో తనిఖీలు



జ్యోతుల మార్కెట్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: పారిశుధ్య కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలోను వేయకుండా ప్రజలు, వ్యాపారులు తమ వంతు సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. శుక్రవారం ఆయన కాకినాడ మెయిన్ రోడ్, పెద్ద మార్కెట్, జ్యోతుల మార్కెట్, లక్ష్మీనారాయణ కంపెనీ ప్రాంతాలలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్‌తో కలిసి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కొన్నిచోట్ల వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయడానికి గుర్తించారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా చెత్తను రోడ్లపై వేస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. సమ్మె వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, అయితే ప్రజల నుంచి కూడా తగిన తోడ్పాటు అవసరమన్నారు. గృహిణులు చెత్తను ఇళ్లకు వచ్చే హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే అందజేయాలని సూచించారు. ప్రజా సహకారం లేకపోతే పారిశుధ్యం క్షీణించి అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు సీజనల్ వ్యాధులకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వి.రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

జాతీయ టెక్‌ఫెస్ట్‌లో లక్ష్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన లక్ష్య స్కూల్ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐఐటీ ముంబైలో గత డిసెంబర్ 27న నిర్వహించిన ఆలిండియా ఆర్టిఫిషియల్, రోబోటెక్ టెక్‌ఫెస్ట్‌లో నిర్వహించిన పోటీలలో లక్ష్య ఇంటర్నేషనల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశ వ్యాప్తంగా 98 పాఠశాలల నుంచి 700 జట్లు పాల్గొనగా సౌత్ జోన్ సీనియర్ విభాగంలో మొదటి స్థానం, జాతీయస్థాయిలో నాలుగో స్థానంలో సానా రిహాన, పైడా సుదీప్, పుప్పాల గౌతమ్ బృందం, జూనియర్స్ విభాగంలో సౌత్ జోన్ రెండో స్థానం, ఆలిండియాలో ఆరో స్థానం సాధించిన జూనియర్ విభాగ బృందం విద్యార్థులు నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి, మురళీశెట్టి అభినవ్, ద్వారంపూడి మనోహర్‌రెడ్డిలు ఆకాష్ అంబానీ, ఇస్రో చైర్మన్ సోమనాథన్, ఎడ్మిరల్ నావెల్ స్టాఫ్ ఆర్.హరికుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ వందన బెహరా, వైస్ ప్రిన్సిపాల్ హేమలత శుక్రవారం పాఠశాలలో అభినందించి పాఠశాలలో రోబోటిక్స్ కోసం ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నామన్నారు.

వేంకటేశునిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రతమహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు వేంకటేశ్వరునిగా భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గురజనాపల్లి వద్ద జగనన్న మెగా కాలనీ

- 8 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు
- ఎమ్మెల్యే కన్నబాబు వెల్లడి



ఉప్పు భూములను అధికారులు, నాయకులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం గురజనాపల్లి సమీపంలో ఉప్పు భూములు 160 ఎకరాల్లో జగనన్న మెగా కాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెల్లడించారు. పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాలకు చెందిన ఈ భూములను శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ భూముల్లో కాకినాడ రూరల్, అర్బన్, కరప మండలాలకు చెందిన 8 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎంతో విలువైన భూములను తీసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేంద్రప్రభుత్వంతో మాట్లాడి అనుమతి పొందారన్నారు. రెండు వారాల్లో పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని, శనివారం నుంచి పనులు వేగవంతం చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 32 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చామని ఎమ్మెల్యే కన్నబాబు వివరించారు. ఆర్డీఓ కిశోర్, హౌసింగ్ పీడీ కె.శ్రీనివాస్, డ్వామా ఏపీడీ మాధవి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పబ్బినీడి పాపారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, నడకుదురు సర్పంచ్ దేగల లలిత కుమారి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి దూసుకుపోయిన పాఠశాల బస్సు

సామర్లకోట: ప్రైవేటు స్కూల్ బస్సు శుక్రవారం కోలావారి వీధిలోని డ్రైనులోనికి దూసుకుపోయింది. సామర్లకోట నుంచి పెద్దాపురంలోని పాఠశాలకు విద్యార్థులను తీసుకు వెళుతున్న సమయంలో బస్సు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి అపాయమూ జరగలేదు. డ్రైవరు నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: మండలంలోని చిత్రాడలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...పిఠాపురం పట్టణానికి చెందిన పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ కోన విజయ్‌కుమార్ మోటారు సైకిల్‌పై కాకినాడ వెళుతుండగా చిత్రాడ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలానికి బస్సు సర్వీసు

తుని: అరుణాచలం గిరి ప్రదక్షణకు వెళ్లే భక్తుల కోసం తుని ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు తుని నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం గిరి ప్రదక్షణ, కంచి క్షేత్రాలను దర్శించుకోవచ్చునన్నారు. భక్తులు రిజర్వేషన్ టికెట్ల కోసం 73829 13216, 73829 13016 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.